# భీమాస్ రఘు



**తెల్లటి మీసం రెండు ప్రక్కలా తెలుగు విధేయతా! తమిళ వినయతా! మిలుక్కు మిలుక్కు మంటుంటాయి!**

**-తిరుపతిలోని త్యాగరాజ సంగీతోత్సవాల ప్రధానకర్త!**

**గాన ఆరాధులకు 'భీమాస్'లోనే వసతి భోజన ఆతిధ్యకర్త -**

**ఎందరో మహానుభావులు! అందరికీ వందనమనే త్యాగరాజ విధేయుడు! త్యాగబ్రహ్మ పేరిట రెండంతస్థుల భవనం నిర్మించాలని ఉవ్విళ్ళూరుతున్నాడు. తథాస్తు అందాం! శీఘ్రమేవ సిద్ధిరస్తు అందాం!**

**వం**దితుడు, అభినందితుడు ఆయనే! త్యాగరాజు పట్ల అపారవినయాను రాగమూర్తీ రఘుయే! ఇతనికి తోడూ సహతేడూ కంచి రఘురామ్ కూడా రఘుయే!

ఆ మీసాలు కరుణ వినయతలకు చిహ్నాలు. ఆ వీనులు త్యాగరాజనుత కీర్తనా శ్రవణానికే అంకితమయ్యాయ్. ఓ వందమంది కార్యకర్తలు చేసే పనిని రఘు ఒక్కడే చేస్తాడు. కర్ణాటక సంగీతోద్ధారకుడు. రఘును తెలియని సంగీత విశారదులు లేరంటే అతిశయోక్తి కాదు.

గోవిందరాజ గోపురమునకు ఎదురుగా శిఖరానికి ధీటుగా భీమాస్ డీలక్స్ హోటల్ దశాబ్దాలుగా ఉంటోంది. తిరుపతి రైలుస్టేషన్‌కు కొన్ని అడుగుల దూరంలో ఉంటుంది. రుచికరమైన ఉపాహార, పూర్ణాహారములకు నిలయం. శుచికరమైన ఆరోగ్యప్రదమైన వసతికి భీమాస్ భేష్ భేష్ అనేట్లుంటుంది. భీమాస్ కారణంగానే ఆ రోడ్‌కు అంత విలువ వచ్చింది.

ఒరులెవ్వరూ చేయనంత కర్ణాటక సంగీతారాధనను చేస్తూ పదిరోజులపాటు ఉదయం, సాయంత్రమూ జరిపిస్తున్న భీమాస్ రఘు తిరుపతి వాసులకే కాదు, ఆంధ్ర, తమిళనాడు, కేరళ, ఒరిస్సా రాష్ట్రాల్లో గల సంగీత విద్వాంసులను తిరుపతి పట్టణం పిలిపించి, వసతి కల్పిస్తూ భోజరాజులా కర్ణాటక సంగీతోత్సవాలను జరిపిస్తున్నారు.

తిరుపతి పట్టణం మధ్యగల తమ సంస్థా స్థలంలో రెండు అంతస్థుల భవనం నిర్మించి, నిరతమూ త్యాగరాజ సంకీర్తనం జరుపాలనే సత్సంకల్పం, రఘులో ఉన్నది. త్వరలో సిద్ధిస్తుందనెడి ఆశాభావమును వ్యక్తపరుస్తున్నాం.



# పూజ్యశ్రీ శ్రీ సుబుధేంద్ర తీర్థ శ్రీపాదులవారిని దర్శించగలననే విశ్వాసంతో ఉన్నాను

## మంత్రాలయం శ్రీగురురాఘవేంద్ర పీఠాధీశులు శ్రీశ్రీ సుబుధేంద్ర తీర్థ శ్రీపాదులవారు మహాపండితులు, బహుభాషా ప్రవీణులు

శ్రీశ్రీ సుబుధేంద్ర తీర్థ శ్రీపాదులవారు మహాపండితులు బహుభాషా ప్రవీణులు. వారిని పూర్వాశ్రమంలోనే చూసాను. ఆశ్రమం స్వీకారాన్తరమ్ చూసే అదృష్టం కలుగలేదు.

వారు జ్ఞాని. మహా పండితులు. మోమున నిరతమూ నిండు పున్నమిలా భాసిల్లు నవ్వు, ఎంత దవ్వునుండి చూచినప్పటికీనీ నా మనసున వసంత చంద్రికా వీచికను స్పృశింపచేసేది. వెన్నెలలా చల్లని మనసు, తేనెలవంటి తీయని మృదుభాషణ, ఆత్మీయత ఎంతగా పరవశింపచేసేదో అక్షరబద్ధం చేయలేను. సంస్కృతాంధ్ర కన్నడ, తమిళ, ఆంగ్ల భాషల్లో మహాపండితులైనప్పటికినీ, అతి నిరాడంబరులు. వారికి ప్రముఖాంధ్ర అంటే ప్రేమ. వారికి కరుణ, ప్రేమ, జాలి తప్ప వేరేఁవీ తెలియవేమోననిపించేది. రాఘవేంద్రుని బృందావన నందనంలో వారు ఉపవిష్టులయి ప్రశాంతంగా అరగంట కాలమైనా గడిపేవారు.

బృందావనంలో సజీవంగా ఉన్న శ్రీశ్రీ రాఘవేంద్రయతీంద్రులు వారి విద్యా, వినయమూ అంకిత భావకతకు అబ్బురపడి యుంటారేమో కోరి ఆయన్ను మంత్రాలయ బృందావన పీఠాధీశులుగా యెన్నిక చేసుకున్నారనుకుంటాను. రాఘవేంద్రసార్వభౌములు శ్రీశ్రీ సుబుధేంద్ర తీర్థులవారిని దర్శించే అవకాశం కలుగలేదు. కల్పిస్తారని ఎదురుచూస్తున్నాను. శ్రీశ్రీ సుబుధేంద్ర తీర్థుల దర్శనంలో ఆయురారోగ్యములు కలుగగలవని ఆశిస్తున్నాను.

# అక్షరాలా అక్షరహత్యలౌతున్నాయ్!

ప్రపంచ భాషల్లో దాదాపు అన్నిటికీ 'లిపి' ఉన్నప్పటికీ, ఇంకా లిపిలేని భాషలు ఉన్నాయి. వాటికి లిపి ఏర్పాటు చేసేందుకు భాషా శాస్త్రవేత్తల ప్రయత్నాలు కొనసాగుతూన్నాయి. లిపి ఉన్నా లేకపోయినా, ప్రతి భాషకూ వాడుకకు సంబంధించిన కొన్ని సంప్రదాయాలు ఉంటాయి. వాటిని పాటించినప్పుడే ఆయా భాషలకు ఇంపు కలుగుతుంది. ఏ భాషకు సంబంధించిన సంప్రదాయం ఆ భాషదే! దేని అందం దానిదే!

'అ' నుండి 'క్షఱ' వరకు ఉండే తెలుగు అక్షరాలు తక్కిన అన్ని భాషల అక్షరాల కన్నా ఎక్కువే. ఆ సంఖ్యలో సగమే ఉంటాయి ఆంగ్ల భాషాక్షరాలు. ఐతే ఆ భాషకు అధిక ప్రాధాన్యం/ ప్రాముఖ్యం ప్రస్తుతం ఉన్నదనే నెపంతో తెలుగు అక్షరాలను కుదించేందుకు ప్రయత్నించడం వివేకం కాదు. అలా చేస్తే మన మాతృభాషకు ఉండే సొబగు మొత్తాన్నీ నాశనం చేసినట్లే అవుతుంది. భాషా సంప్రదాయాలను ధిక్కరించడం మొదలుపెడితే, ఆ భాష అంతరించడానికి ఎంతో కాలం పట్టదు. 'తేనెలొలుకు' తెలుగుభాషకు, అసలు అలాంటి కీర్తి ఎందుకు కలిగిందో మనం మర్చిపోతే, లేదా తెలుసుకునే ప్రయత్నం చేయకపోతే, దేశభాషలందు తెలుగు 'లెస్' అయిపోతుంది.

'ఉదయం' అనే పదాన్ని 'వుదయం' అంటూ ఎందుకు వ్రాయకూడదనే వాళ్ళు పెరుగుతున్నారు. అచ్చులలో 'అ' 'ఆ'లను తప్ప తక్కిన వాటిని చంపేసే ప్రయత్నం జరుగుతోంది. 'యి', 'యీ' 'వు' 'వూ' 'యె' 'యే', 'వొ' 'వో' ఎప్పుడు వ్రాయాలో, ఎప్పుడు వ్రాయకూడదో తెలుసుకోవాలన్న జిజ్ఞాస చాలామందిలో కొరవడుతోంది. సౌలభ్యంపేరిట ఈ పాటికే మనం 'ఌ' 'ౡ' అనే అక్షరాల్ని అంతం చేసేశాం. ఇక 'శ' 'ఱ' అనే అక్షరాల్ని కూడా సమాధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామంటే అతిశయోక్తి కాదు. మనకు 'న' 'ల' అనే అక్షరాలు ఉన్నాయి. కాబట్టి 'ణ' 'ళ' అనే అక్షరాలు అనవసరం అని కొంతమంది వాదిస్తున్నారు.

'శ' 'స' 'ష' అనే అక్షరాల్లో బేధాన్ని స్పష్టంగా గుర్తించినప్పుడే 'తేటతెలుగు'లోని తియ్యందనమేమిటో అర్థమౌతుంది. అలాంటి విభిన్న శబ్దాలను సొంతం చేసుకున్నది గనుకనే మన తెలుగు 'లెస్స' అయింది. నాలిక తిరగడం లేదని అక్షర సౌందర్యాన్ని పోగొట్టుకోవడం అనర్థదాయకమే. చదువులు తల్లిని 'షరస్వతి' అని, 'షారదా' అనీ ఉచ్చరించడం వి'షా'దమే!

మనకు 'ఋ' అనే అక్షరం ఉంది. అలాగే 'రు' ఇంకా 'ఱు' అనే అక్షరాలూ ఉన్నాయి. 'ఋ'– 'రు'– 'ఱు'ల మధ్య గల బేధం ఏమిటని అడిగితే, మొదటిది 'అచ్చు' అనీ, తక్కినవి రెండూ 'హల్లుల'కు చెందినవనీ జవాబు చెప్పవచ్చు. ఐతే దేని ప్రత్యేకత దానికే ఉన్నదనీ, అద్దానిని అలా ప్రయోగించినప్పుడే గుబాళింపు వస్తుందని కచ్చితంగా చెప్పగలవాళ్లు తగ్గిపోతున్నారు. 'ఋ', 'ఱు'లకు బదులుగా 'రు'ను ఉమ్మడిగా వాడేస్తున్నారు. అక్షరమాలను నేర్చుకునే క్రమంలో చాలామంది పిల్లలకు ఇబ్బంది కలిగించే అక్షరం అది. 'బ'కి కొమ్మిస్తే 'బు' అనీ, 'బు'కి కొమ్మిస్తే 'ఋ' అనీ బండగుర్తుగా మెదళ్ళలో అట్టిపెట్టుకుంటున్నారు. నిజానికి 'ఋ' అక్షరంతో మొదలయ్యే మాటలు పట్టుమని పాతిక కూడా ఉండవు. ఐతే 'అమృతం' వంటి మాటల్లో అంతర్లీనంగా ఉంటుంది. అలాంటి 'ఋ'కి ఉండే ప్రత్యేకత అంతా ఇంతా కాదు. ఏదో తెలియని పవిత్రతా భావం ఆ అక్షరాన్ని అంటిపెట్టుకుని ఉంటుంది. 'ఋ'తో మొదలయ్యే ఒక పదాన్ని చెప్పమంటే చాలామంది 'ఋషి' అంటూ ఠక్కున చెప్పేస్తారు. బహుశ అందువల్లే ఆ అక్షరానికి అలాంటి పవిత్రత వచ్చిందేమో!

ఋషుల్లో శుక, శౌనక, వ్యాస, వాల్మీకి వంటి మహర్షులున్నారు. జనకుడి వంటి రాజర్షులున్నారు. సప్తర్షులు అనబడే ఒక క్రమం ఉంది. అందులోమరీచి, అత్రి, అంగీరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు ఉన్నారు. ఇంకో క్రమం కూడా ఉంది. దాని ప్రకారం కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని, వశిష్ఠుడు అనే ఋషులు ఏడుగురు. ఆ విధంగా 'ఋషి' అనే పదాన్ని చూసినా, విన్నా మన పూర్వులంతా తలపునకు వస్తారు. ఇంకో బలమైన కారణం కూడాఉంది. 'ఋషి' అనే పదానికి 'వేదము' 'వెలుగు' అనే అర్థం కూడా ఉన్నది.




'ఋక్కు' అనే మాటకు కూడా 'వేదం' అనే అర్థం. వేదభాగ విశేషాన్ని చూపించే పదమది. ఇక 'ఋత్విజుడు' అంటే ఎవరనుకున్నారు? యజ్ఞకర్త చేత, ధనం పుచ్చుకుని, యజ్ఞం చేయించేవాడు. 'ఒజ్జ' అని కూడా అంటారు. ఋత్విజులు మొత్తం పదహారు విధాలు– బ్రహ్మ, ఉద్గాత, హూత, అధ్వర్యుడు, బ్రహ్మణాచ్ఛంపి, ప్రస్తోత, మైత్రావరుణుడు, ప్రతిప్రస్థాత, పోత, ప్రతిహర్త, అచ్ఛావాకుడు, నేష్ట, అగ్నీధ్రుడు, సుబ్రహ్మణుడు, గ్రావస్తుడు, ఉన్నేత వీరందర్నీ గుర్తు చేస్తుంది 'ఋ'

'ఋభుక్షుడు' అంటే ఇంద్రుడు. 'ఋభువు' అంటే వేల్పు. ఋష్యకేతువు అంటే మన్మథుడు. అతడిని తలుచుకోగానే 'ఋతువులు' గుర్తొస్తాయి. వసంతం, గ్రీష్మం, వర్ష, శరత్తు, హేమంతం, శిశిరం అనేవి ఆరు ఋతువులు. ఇంకా 'ఋతువు' అనే మాటకు 'ఆర్తవము', 'వెలుగు' అనే అర్థాలు కూడా ఉన్నాయి. 'ఋతము' అంటే సత్యవాక్కు, అలాగే జలము, పూజింపబడినది, ప్రకాశమొందినది అనే అర్థాలూ ఉన్నాయి. 'ఋక్షము' అంటే నక్షత్రము. ఇంకా ఒకానొక కొండ, ఎలుగుగొడ్డు అనే అర్థాలూ ఉన్నాయి.

'ఋష్యము' అంటే ఎనుబోతు. 'ఋష్యమూక' పర్వతం గురించి రామాయణంలో ప్రస్తావన ఉంది. 'ఋషభము' అంటే ఎద్దు. ఐతే ఆ పదానికి ఇంకా చాలా అర్థాలు ఉన్నాయి. ఓ ఆయుర్వేద ఉషధీ విశేషంగా చెప్తారు. చెవి రంధ్రాన్ని అలా పిలుస్తారు. సంగీతంలో ఒక స్వరం పేరు. శ్రేష్ఠుడు అనే అర్థమూ ఉంది. ప్రసిద్ధ క్షేత్రమైన తిరుమలకు కూడా 'ఋషభము' అనే పేరు ఉంది. తిరువేంకటపతిని తలచుకోగానే కుబేరుడు ఇచ్చిన అప్పు వ్యవహారం గుర్తొస్తుంది. 'ఋణము' అంటే అప్పు. పుట్టిన ప్రతి వ్యక్తికీ 'ఋణం' ఏదో రకంగా తప్పదు. దేవ ఋణం, పితృఋణం, ఋషిఋణం... వీటిని ఋణత్రయం అంటారు.

'ఋణార్థము' అంటే అప్పు తీర్చడానికి చేసిన మరో పప్పు. అప్పు చేసినవాడిని 'ఋణి' లేదా 'ఋణికుడు' అంటారు. ఋతి అంటే త్రోవ, పోటీ, శుభము అనే అర్థాలున్నాయి. 'ఋతుమతి' అంటే పుష్పవతి అయిన స్త్రీ. 'ఋద్ధము' అంటే పెరిగిన లేక నూర్చిన ధాన్యము. 'ఋశ్యప్రోక్త' అంటే దూలగొండి మొక్క, 'ఋష్యప్రోక్త అంటే ఆముదం చెట్టు. 'ఋక్షగంధిక' అంటే నల్లనేల గుమ్మడి లేక పాలగుమ్మడి మొక్క. 'ఋక్షగంధ' అంటే బచ్చలి లేదా బొద్దికూర మొక్క. 'ఋజీషము' అంటే బూరెల మూకుడు లేదా పిండివంటలు చేసే పాత్ర అని. 'ఋజువు' అంటే నాణ్యమైనదీ, వంకరలేనిది అనే అర్థాలున్నాయి. 'ఋక్థము' అంటే ధనము. 'ఋద్ధి' అంటే సమృద్ధి. 'ఋ'తో ఇంతకన్నా పదాలు లేకపోగా 'ౠ' అక్షరంతో మొదలయ్యే ఒక్క పదమూ లేదు. ఐనప్పటికీ అంతటి ప్రత్యేకత కలిగిన 'ఋ' అక్షరాన్ని కాపాడుకోవాలో లేదో నిర్ణయించుకోవాల్సిన అవసరం ఆసన్నమయింది. సరిగ్గా అలాంటి పరిస్థితే 'ఱ' అక్షరానికి కూడా ఉంది. 'బండి ర' అంటూ పిలుచుకునే 'ఱ' అక్షరం లేదా గుణింతాలతో కలిసిన 'ఱ' అక్షరంతో మొదలయ్యే పదాలు మొత్తం మీద డెబ్బైవరకూ ఉంటాయేమో. ఐతే 'ఋ' అక్షరంతో లేని సౌలభ్యం 'ఱ'తో ఉంది. దాన్ని ఒక పదంలో రెండవ లేక చివరి అక్షరంగా కూడా ప్రయోగించవచ్చు. అందువలన 'ఱ' ప్రాముఖ్యతని అంత తక్కువగా అంచనావేసేందుకు వీలులేదు. ఐనా కేవలం తక్కువ పదాల ప్రయోగానికి మాత్రమే ఉపయోగపడుతుంది గనుక ఒక అక్షరాన్ని, ఆ కారణంతో నిషేదించాలనకుంటే, అది మాతృభాష మనుగడకు ద్రోహం చేసినట్లవుతుందేమో ఆలోచించాలి.

(**ఆంధ్రప్రదేశ్** కు కృతజ్ఞతలు)

# జి.వి. రావ్ పేజీ


(గోటేటి వేంకటేశ్వరరావు)

## ధర్మానికి, దేశానికి ఉపయోగపడని శరీరము, ధనము ఎంత పెరిగినా వృథా!

- స్వామి వివేకానంద



## గొప్పోడు




ఆయన పేరు జాకీచాన్. మొదటగా హీరోకు డూపుగా, తరువాత ఫైటర్ గా సినిమాలలోకి వచ్చాడు, తరవాత చిన్న చిన్న వేషాలు వేస్తూ, మెల్లిగా స్టంట్ డైరక్టర్ అయ్యాడు. ఇలా కష్టించి పని చేస్తూ "పోలీస్ స్టోరి" అనే సినిమాతో హీరో అయ్యి ప్రపంచమంతా ఆయన్ను తిరిగి చూసేంత స్థాయికి చేరుకున్నాడు, ఆయన సినిమాలకు ప్రపంచం నలుమూలలా జనం అంతా వెర్రెత్తినట్టు చూసే స్థాయికి అదిగిపోయాడు. ఆసియా ఖండంలో అత్యధికంగా పారితోషికం తీసుకునే స్థాయి కెదిగాడు. మనిషి అంత పేరు సంపాదించినా ఒక్కింత గర్వం లేదు, తనతో పాటుగా నటించిన ఎంతో మందికి సహాయం చేశాడు. బోలెడంత ఆస్థి సంపాదించాడు, అతనికో కొడుకున్నాడు, అతని పేరు జేసిచాన్, అతనో ఆటగాడు, పాటగాడు, తెలుగు సినిమా బాబుల్లా అతని నేమి జాకీ చాన్ ప్రమోట్ చెయ్యలేదు, బలవంతాన్న ప్రేక్షకుల మీదకు రుద్దలేదు, నిర్మాతలను ప్రోత్సహించమని ఆదేశించలేదు, కొడుకు అతని స్వంత ప్రతిభపైనే ఎదగాలనుకున్నాడూ. కాని కొడుకు చేసిన మూడు సినిమాలు పెద్దగా ఆడలేదు. కొడూకూ ప్రవర్తన నచ్చక తన ఆస్థిలో సగం దాన ధర్మాలకు రాసిచ్చేస్తానని చెప్పాడు. కొడుకు అపార్ట్‌మెంట్‌లో మాదక ద్రవ్యాలు దొరికాయని ప్రభుత్వం అరెస్ట్ చేస్తే మన వూరి నాయకుల్లా తన పలుకుబడి ఉపయోగించకుండా, తప్పు చేస్తే అనుభవించాల్సిందే అన్నాడు. మన వూరిలో లాగ లక్షలకు లక్షలు వెచ్చించలేదు, అబద్దమని బొంకలేదు, బెయిల్ అడగలేదు, ఆరు నెలల జెయిలు శిక్ష అనుభవించాడు. బయటకు రావడంతోనే దేశం మొత్తానికి తన క్షమాపణలు చెప్పాడు. తల్లి, తండ్రిని మన్నించమని అడుగుతూ మీరు నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేశానంటూ బాధపడి, ఎక్కడో అజ్ఞాతానికి వెళ్ళిపోయాడు.

ఆ తండ్రి జాకీ చాన్ ఆస్థిలో సగ బాగాన్ని ఒక ఫౌండేషన్ స్థాపించి దాని ద్వారా దానధర్మాలు చేస్తున్నాడు.

కొడుకు బాగుపడి తెలివితేటలుంటే సంపాదిస్తాడని చెపుతున్నాడు.

ఎంత గొప్ప ఆలోచన.

నేను పేపర్లలో చూస్తూ వుంటా ఈ సెలిబ్రిటి కొడుకులని పేజ్3 పార్టీలంటూ గ్లాసులు చేతిలో పెట్టుకుని ఫోజులిస్తూ వుంటారు, ఆ మత్తులో ఎక్కడన్నా యాక్సిడెంట్ జరిగిన తాము కాదని డబ్బుకోసం ఆశపడేవాడిని వెతికి చట్టానికి అప్పజెప్పేస్తారు.

మనము చూశాం గా మీకు చాలా కేసులు గుర్తొస్తున్నాయ్ కదా.

జాకీచాన్ వంటి తండ్రి, తన తప్పు తెలుసుకుని పశ్చాత్తాపపడే జేసి చాన్ వంటి కొడుకు చాలా అరుదుగా వుంటారు. ఆ తండ్రికొడుకులిద్దరూ ఇద్దరే.

* * *

## వయసు ఉడిగాక ఆధ్యాత్మికత ఎందుకు?

కొంతమందికి రిటైర్మెంట్ అయ్యాక, భాద్యతలన్నీ తీరాక అప్పుడు గుళ్ళు, గోపురాలు, తీర్ధయాత్రలు, భక్తి చానళ్ళు, చాగంటివారు, షణ్ముఖశర్మగారు ప్రవచనాలు, ఇవన్నీ గుర్తుకొచ్చేస్తాయి.

భగవంతుడు గుర్తుకొచ్చేస్తాడు, లేని పోని చాదస్తం వచ్చేస్తుంది – ఇంటిలో అందరికి భక్తి గురించి లెక్చర్లు దంచేస్తారు.

ఇవన్నీ చిన్నప్పుడినుంచి చేస్తే దేవుడు వద్దన్నాడా?

భాద్యతలు తీరిపోయాయని మీరనుకుంటే సరిపోతుందా?

మంచి ఆరోగ్యంగా ఉన్నప్పుడు దైవ కార్యం, దేవుని సేవ అలవరచుకోవాలి.

కనీసం రోజుకు అరగంటైనా దేవుడికి కేటాయించండి, లేదు కుదరదు రాచకార్యాలు ముంచుకొస్తాయి అంటారా దానిని రెండు పావు గంటలుగా ఉదయం 15 నిమిషాలు, రాత్రి పడుకోబోయే ముందు 15 నిమిషాలు చిత్త సుద్దితో, ఏకాగ్రతతో, త్రికరణ సుద్దిగా దేవుడిని ప్రార్ధించండి, జరిగే మార్పుని గమనించండి.

శ్రీ కాళహస్తీస్వర శతకంలో దూర్జటి ఏమన్నారో చూడండి.

**దంతంబు ల్పడనప్పుడే తనువునందారూఢి యున్నప్పుడే**
**కాంతాసంఘము రోయనప్పుడే జరక్రాంతంబు గానప్పుడే**
**వితల్మేన జరించనప్పుడె కురుల్వెల్లెల్ల గానప్పుడే**
**చింతింపన్వలె నీపదాంబుజములన్ శ్రీ కాళహస్తీశ్వరా!**

శ్రీ కాళహస్తీశ్వరా! మానవులు ఎవ్వరే కాని తమ దంతములు రాలని స్థితియందు ఉండగనే, తన శరీరమునందు బలము బాగుగ ఉండగానే, స్త్రీలకు తన విషయమున ఏవగింపు కలుగుటకు ముందే, శరీరము ముసలితనముచే శిధిలము కాక ముందే, తన వెంద్రుకలు నెరసి తెలతెల్లన కాకుండగనే, తన శరీరమున మెరుగులు తగ్గని సమయముననే నీ పాదపద్మములను సేవించవలెను.

కాబట్టి దేముడిని సేవించుటకు వయసుతో నిమిత్తం లేదు, ప్రహ్లాదుడి వయసెంత? శబరి వయసెంత? ఇద్దరూ మహా భక్తులే, మానవుడిలో ఊపిరి వున్నంతవరకూ దైవనామ స్మరణ వుండవలసినదే.

* * *

**మమ్మీ డాడీ అంకుల్ ఆంటీలనుచు**
**మనల్నిబానిసలు జేసిన ఎంగిలిపీచుతో**
**లజ్జలేకుండా బొంకేరు తెలుగునాట**
**తెలుగువాడిననుచు మురిసేరు!వెంకటేశ్వరా!**

**- గోటేటి వెంకటేశ్వరరావు**